క్లుప్తంగా

శ్రీమఠంలో రాయచూరు ఏఎస్పీ


పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకుంటున్న రాయచూరు ఏఎస్పీ హరీష్

మంత్రాలయం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్రుల దర్శనార్థమై కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా ఏఎస్పీ హరీష్ శుక్రవారం విచ్చేశారు. ఆయన ముందుగా గ్రామ దేవతను దర్శించుకుని అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనం చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఆయన ఫల, పూల మంత్రాక్షింతలు అందించి ఆశీర్వదించారు.

5న సామాజిక తనిఖీ సమావేశం

ఎమ్మిగనూరురూరల్: ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై జరుగుతున్న సామాజిక తనిఖీపై జూలై 5వ తేదీన బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఓ విజయమోహన్ శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనం ఆవరణలో సమావేశం ఉంటుందని చెప్పారు. 16 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై ఒక ఎస్ఆర్పీ, 7 మంది డీఆర్పీలు గ్రామాల్లో తనిఖీలు చేస్తున్నారని తెలిపారు. వీరు చేసిన తనిఖీలపై బహిరంగ సమావేశం ఉంటుందని వెల్లడించారు.

ప్రశాంతంగా వేలం పాటలు


ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: స్థానిక మేజర్ పంచాయతీలో వివిధ పన్నుల వసూలు హక్కులకు సంబంధించి వేలం పాటను శుక్రవారం సర్పంచ్ పాల్‌దినకర్ అధ్యక్షతన కార్యదర్శి శివప్ప నిర్వహించారు. దినసరి మార్కెట్ హక్కులను మాబమ్మ రూ.12 వేలకు దక్కించుకోగా, బండిమెట్ట రూ.2.25 లక్షలకు భీమయ్య సొంతం చేసుకున్నారు. హక్కులు దక్కించుకున్న వారు జూలై 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 30వ తేదీ వరకు 9 నెలల పాటు రుసుం వసూలు చేసుకోవచ్చని కార్యదర్శి తెలిపారు. వేలంలో హెచ్చు పాడి హక్కులు దక్కించుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని రాజీవ్ గాంధీ నగర్‌లో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న అదే కాలనీకి చెందిన చందు అనే వ్యక్తిని టూటౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు. సదరు వ్యక్తి నుంచి ఆరు బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమ మద్యం కలిగి ఉన్నా, తరలించినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

ఎల్లెల్సీలో నీటి ప్రవాహం

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) హొళగుంద సెక్షన్‌లోని కాలువలో శుక్రవారం నీటి ప్రవాహం జరిగింది. కాలువలో మూడు అడుగుల మేర నీరు ఉండడంతో టీబీ డ్యాం నుంచి కాలువకు నీటిని వదిలారా అని ప్రజలు, రైతులు చర్చించుకున్నారు. వాస్తవంగా కాలువ ఆధునికీకరణ పనుల కారణంగా సీసీ బెడ్డింగ్ ఉండడంతో ఎక్కడ నీరు ఇంకిపోలేని స్థితిలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువలో నీరు చేరింది. కొన్ని చోట్ల రైతులు కాలువలో నీటికి అడ్డువేసి కొద్ది రోజుల తర్వాత తొలగించడంతో ఆ నీరు ముందుకు వస్తున్నాయి. ఈ ప్రవాహాన్ని చూసి కాలువకు నీరు వదిలారని అనుకుంటున్నారు. ఇదిలా ఉండగా బళ్లారి పట్టణ ప్రజల తాగునీటి అవసరాలకు టీబీ బోర్డు అధికారులు ఈ నెల 22 నుంచి వంద క్యూసెక్కులు, కొన్నిసార్లు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అయితే ఆ నీరు 180 కి.మీ పరిధిలోని హొళగుంద సెక్షన్‌లోని కాలువ వరకు వచ్చే అవకాశాలు లేవు. వర్షపు నీరు కాలువలో భారీగా చేరడంతో జలకళ సంతరించుకుంది.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు
- అర్థవంతంగా మున్సిపల్ మీట్


మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు


హాజరైన మున్సిపల్ కౌన్సిలర్లు

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పట్టణాభివృద్ధికి అందరి సహకారం అవసరమని, ఇందుకు అధికార, విపక్ష సభ్యులు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో చైర్మన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు దయాసాగర్, రామ్‌దాస్‌గౌడ్ వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులకు, చైర్మన్‌కు స్వీట్లు పంచిపెట్టి ఎమ్మెల్యేగా ఎన్నికైన బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు కౌన్సిలర్లు డిష్ కేశవరెడ్డి, వెంకటాపురం బజారి, ఎంకె.శివప్రసాద్, కామర్తి నాగేషప్ప మాట్లాడుతూ.. తమ వార్డుల్లో విద్యుత్, సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపట్టాలని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ.. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా డ్రైనేజీల శుభ్రతకు చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో 11 నుండి 19వ వార్డు వరకు కొత్తగా బోర్లు వేయడం, పాత బోర్లకు ఫ్లషింగ్ చేసే పనులను ఆమోదిస్తూ కౌన్సిల్‌లో సభ్యులు తీర్మానం చేశారు. ఆర్అండ్‌బీ వసతి గృహం నుంచి శివ సర్కిల్ వరకు సెంట్రల్ లైటింగ్‌లో భాగంగా ఎల్ఈడీ రోప్ లైట్లు వేసేందుకు, 9వ, 12వ, 15వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి, 27, 29వ వార్డుల్లో కల్వర్టుల నిర్మాణానికి, ఏపీ టిడ్కో ఏజెన్సీ, అమృత్ పథకం కింద వీకర్ సెక్షన్ కాలనీల్లో మంచినీటి సరఫరా పథకానికి మున్సిపల్ వాటా కింద రూ.27 లక్షలు ఏపీయూఎఫ్ఐడీసీకి చెల్లించేందుకు సభ్యులు ఆమోదించారు. అదేవిధంగా 23వ వార్డులో మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటుకు, ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి కోసిగి రోడ్డు వరకు పాత అండర్ గ్రౌండ్ కేబుల్ స్థానంలో రూ.5 లక్షలతో కొత్త కేబుల్, సెంట్రల్ లైటింగ్ కొనుగోలుకు తీర్మానించారు. శివ సర్కిల్ సమీపంలోని గౌడప్ప గౌడ్ ఆస్పత్రి నుంచి గోనెగండ్ల బైపాస్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు సాధారణ నిధుల నుంచి రూ.40 లక్షలు మంజూరు చేసేందుకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అలాగే 16వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణం, డ్రైన్ రక్షణ గోడ నిర్మాణానికి రూ.15 లక్షలు కేటాయిస్తూ ఆమోదించగా పట్టణంలోని 5.91 ఎంఎల్‌డీ కెపాసిటీ కలిగిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ తదితర విభాగాల్లో మరమ్మతులు చేపట్టేందుకు సాధారణ నిధుల నుంచి రూ.40 లక్షలు మంజూరు చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పలు వంకల్లో పూడిక తీతతో పాటు సీసీ రోడ్ల నిర్మాణాలు, కల్వర్టుల నిర్మాణాలకై మున్సిపల్ సాధారణ నిధుల నుంచి కేటాయిస్తూ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో కమిషనర్ గంగిరెడ్డి, ఆర్ఓ బేబి, డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, టీపీఓ గోపాలకృష్ణ, ఏఈలు మదన్, శరత్‌చంద్ర, మేనేజర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై అడ్డంగా గుర్రాల సంచారం

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలోని ఎమ్మిగనూరు – కర్నూలు ప్రధాన రహదారిపై వాహనాలకు అడ్డంగా గుర్రాలు సంచరిస్తుండడంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. శుక్రవారం రోజు గుర్రాలు రోడ్డుపై పెరుగులు పెడుతుండడంతో ఎక్కడ తమను ఢీకొడతాయోనని రోడ్డుపై వెళ్లే పాదచారులు, వాహనదారులను భయంతో దూరంగా పరుగులు తీశారు. నిత్యం జనం రద్దీగా ఉండే ప్రాంతాలు బస్టాండ్, వైఎస్సార్ సర్కిల్, స్టేట్ బ్యాంక్, సంత మార్కెట్ రోడ్లలో రోజూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో గుర్రాలు తగలడంతో పాదచారులు గాయపడడం, అలాగే ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టి గుర్రాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.


గోనెగండ్ల బస్టాండ్ వద్ద రోడ్డుపై అడ్డంగా సంచరిస్తున్న గుర్రాలు

టిడ్కో కాలనీలో సదుపాయాలు కల్పిస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని అర్బన్: టిడ్కో ఇల్లు పొందిన లబ్ధిదారులు ఇళ్లల్లో చేరాలని, తగిన సదుపాయాలు, సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. శుక్రవారం సిరుగుప్ప క్రాస్‌లో ఉన్న టిడ్కో ఇళ్లను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల డబ్బుతో, ప్రజల కోసం ఏర్పాటు చేసిన 4700 గృహాల్లో దాదాపు 2 వేల గృహాలు పూర్తయ్యాయని, వాటిలో ప్రజలు నివాసం ఉంటే వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అదేవిధంగా టిడ్కో కాలనీ నుంచి పట్టణానికి ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తానని, ఆటో వసతి కూడా కల్పిస్తామన్నారు. రక్షణకు పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేస్తామని, అలాగే పీహెచ్‌సీ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్లల్లో చేరాలని సూచించారు. టిడ్కో ఎస్‌సీ రాజశేఖర్, డీఈ హరికృష్ణ, ఏఈ, నాయకులు మల్లప్ప, నాగరాజుగౌడ్, సాయికుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

ఆదోని అర్బన్: ఆదోనిలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని భవన నిర్మాణ కార్మికులు మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలను విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే ఇసుకకు సంబంధించి నూతన విధివిధానాలు ప్రకటించగానే కార్మికులను కలిసి ఏ సమస్య ఉన్నా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న యూత్ సభ్యులు

కోసిగి: బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని సాతనూరు గ్రామ అంబేడ్కర్, మదర్ థెరిస్సా యూత్ సభ్యులు సూచించారు. శుక్రవారం మండలంలోని సాతనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే అంబేడ్కర్, మదర్‌థెరిస్సా యూత్ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు అవగాహన సదస్సు కల్పించారు. వారు మాట్లాడుతూ పిల్లలు బడిలో పెద్దలు పనిలో ఉండాలన్నారు. విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతి ఒక్క కుటుంబంలో పిల్లలను పనులకు పంపించకుండా బడి పంపించి విద్యవంతులను చేయాలని సూచించారు. గ్రామంలో పనులకు వెళ్లే పిల్లలు ఉంటే వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించేలా చూడాలన్నారు. ప్రభుత్వం పిల్లల భవిష్యత్ కోసం ఉచిత విద్యను అందిస్తోందన్నారు. పిల్లలకు బంగారు భవిష్యత్ ఉండాలంటే విద్యతోనే సాధ్యమని వివరించారు. గ్రామ యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి


మాట్లాడుతున్న మహాయోగి లక్ష్మమ్మ కో-ఆపరేటివ్ బ్యాంకు బోర్డు సభ్యులు

ఆదోని అర్బన్: రుణాలను తీసుకున్న వారు సకాలంలో తిరిగి చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటునందించాలని మహాయోగి లక్ష్మమ్మ కో–ఆపరేటివ్ బ్యాంకు ఫౌండర్, చైర్మన్ రాచోటి రామయ్య, రాచోటి సుబ్బయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక బ్యాంకులో యాన్యువల్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకులో 15,498 మంది ఖాతాదారులు ఉన్నారన్నారు. బ్యాంకు నికర లాభం రూ.2,03,86,599 వచ్చిందని ఆడిటర్లు నిర్ధారించారన్నారు. బ్యాంకు డివిడెంట్ ఈ యేడాది 8.5 గా ఇవ్వడం జరుగుతుందన్నారు. నేటికీ బ్యాంకు డిపాజిట్లు రూ.266 కోట్లు ఉన్నాయని, ఖాతాదారులకు రూ.173 కోట్లు అప్పు రూపంలో అందించినట్లు వివరించారు. అలాగే పొదుపు మొత్తాలకు ఆకర్షణీయమైన రుణాలను అందిస్తూ ఖాతాదారులు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకు కృషి చేస్తోందన్నారు. బ్యాంకు సీఈఓ గట్టు మురళికుమార్, బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ మెంబర్లు హుసేన్‌అహ్మద్, ఆంజనేయులు, ఆర్ఎంజి రెడ్డి, ఎన్.వి.ఎస్.గుప్త, డైరెక్టర్లు, ఎలిజిబుల్ మెంబర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతోనే లక్ష్య సాధన


విద్యార్థినికి ప్రశ్న వేసి సమాధానం రాబడుతున్న ట్రైనీ ఐఆర్ఎస్ అధికారి సమీర్‌రాజా

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థికి పట్టుదల, క్రమశిక్షణ, ఏకాగ్రత ఉంటే ఏదైనా సాధించవచ్చని ట్రైనీ ఐఆర్ఎస్ అధికారి సమీర్‌రాజా అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో యూపీఎస్‌సీ, ఏపీపీఎస్‌సీ గ్రూప్ సర్వీసులపై వృక్షశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ మురళీమోహన్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ట్రైనీ ఐఆర్ఎస్ అధికారి సమీర్‌రాజా మాట్లాడారు. ఏకాగ్రత, పట్టుదల, క్రమశిక్షణతో అనుకున్న లక్ష్యాన్ని సులువుగా చేధించవచ్చన్నారు. సాధించాలనే తపన ప్రతిరోజూ మనల్ని మేల్కొపేలా ఉండాలన్నారు. అధ్యాపకులు చెప్పే పాఠాలను ఎప్పటికప్పుడు అర్థం చేసుకుని వాటిని ప్రాక్టికల్‌గా సాధన చేయాలని సూచించారు. విద్యార్థి దశలోనే భవిష్యత్‌పై ఒక ప్రణాళిక ఉండాలని, తదనుగుణంగా విద్యార్థులు తమ జీవితాలను మార్చుకొని కన్నవారి కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ట్రైనీ ఐఆర్ఎస్ అధికారి సమీర్‌రాజాను అధ్యాపకులు శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాదరణతోనే వైఎస్సార్‌సీపీకి 40 శాతం ఓట్లు


హాజరైన గోనెగండ్ల మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పక్కన మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి
- గోనెగండ్ల మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ ఉన్నందుకే సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీకి 40 శాతం ఓట్లు వచ్చాయని, పార్టీ శ్రేణులు అధైర్యపడవద్దని, అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక భరోసానిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో పార్టీ కార్యాలయం ఆవరణలో గోనెగండ్ల మండల వైఎస్సార్‌సీపీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు, నాయకులంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. ప్రత్యర్థి కూటమిలోని మూడు పార్టీలు కలిసి తప్పుడు ప్రచారం, మోసపూరిత హామీలతో అధికారం చేజిక్కించుకున్నారని విమర్శించారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీ శ్రేణులు సొంత పనులు చేసుకొంటూ గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి పాటు పడాలని సూచించారు. పార్టీలు మారుతారన్న పుకార్లను నమ్మవద్దని సూచించారు. అబద్ధపు ప్రచారం, అసంబద్ధ హామీలతోనే చంద్రబాబు గద్దెనెక్కారని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అబద్ధాలు చెప్పలేక ఓడిపోయారన్నారు. గ్రామాల్లో ఎవరూ టీడీపీకి భయపడాల్సిన అవసరం లేదని ధైర్యంగా ఎదుర్కోందామన్నారు. గెలుపొందిన కూటమి నాయకులు హామీల అమలుపై దృష్టి సారించాలన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రానున్న స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఐక్యతతో పనిచేసి ఆయా ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, ప్రతుల్, బీఆర్ బసిరెడ్డి, నాగేష్‌నాయుడు, కృష్ణారెడ్డి, బందెనవాజ్, భాస్కర్‌రెడ్డి, మన్సూర్, తిరుమల్‌రెడ్డి, కాశీవిశ్వనాథ్‌రెడ్డి, పలుగ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై అవగాహన

ఎమ్మిగనూరురూరల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ అపర్ణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో బనవాసి కేవీకే, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణుల్లో ముఖ్యంగా ఐరన్ లోపిస్తే రక్తహీనత కలుగుతుందని, సెలీనియం, అయోడిన్, జింక్, విటమిన్ బీ 12, ఫోలిక్ యాసిడ్ లోపాలను వారికి వివరించాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటు తల్లీబిడ్డలు బాగుంటారని చెప్పారు. బాలింతలు ఆరు నెలల పాటు క్యాల్షియం, విటమిన్–డి , ఐరన్ కలిగిన ఆహారం తీసుకుంటే మంచిదని, అలాగే వ్యక్తిగత శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే డాక్టర్లను సంప్రదించేలా చూడాలన్నారు. సూపర్‌వైజర్ సుపర్విన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులు శుభ్రం

గోనెగండ్ల: మండల కేంద్రంలోని మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించినట్లు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓ సతీష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా చర్యగా ఓహెచ్ఆర్ ట్యాంకులను శుభ్రం చేయించడం జరిగిందన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లి సోడియం హైపో క్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేయించినట్లు చెప్పారు. ప్రజలు కూడా వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఎవరికైనా జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలుంటే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు.

పిల్లలందరినీ బడిలో చేర్పించాలి


నందవరంలో మానవహారం చేపట్టిన విద్యార్థులు

నందవరం: బడి బయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలని మండల విద్యాధికారులు–1,–2 రామాంజనేయులు, రఘునాథ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. స్పెషల్ స్కూల్ విద్యార్థులతో ప్రధాన వీధుల్లో, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెద్దలు పనికి పోవాలని, పిల్లలందరూ బడికి రావాలని పిలుపునిచ్చారు. చదువు ద్వారా పిల్లలకు విజ్ఞానం పెరుగుతుందన్నారు. స్పెషల్ స్కూల్ హెచ్ఎం దుబ్బన్న, ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఉరుకుంద, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● ఒకే ట్రాక్టర్‌కు నాలుగు గుంటికలు


పత్తి పంటలో గుంటికలు పాస్తున్న రైతన్నలు

కౌతాళం: వర్షాభావ పరిస్థితులకు తోడు కూలీలు దొరకకపోవడంతో వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకునేందుకు రైతులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. పత్తి పంటలో పెరిగిపోయిన కలుపు మొక్కలను తొలగించేందుకు ట్రాక్టర్ ద్వారా పొలం పనులు చేయడంతో పాటు ఒకే ట్రాక్టర్‌కు నాలుగు గుంటికలతో సేద్యం చేస్తున్నారు. దీని వల్ల వ్యవసాయ పనులను త్వరితగతిన పూర్తిచేయడమే గాక ఒకే రోజు 10 నుంచి 15 ఎకరాల్లో గుంటికలతో సేద్యం చేయవచ్చని రైతులు తెలిపారు. ఒకే ట్రాక్టర్‌కు నాలుగు గుంటికలతో సేద్యం చేస్తున్న దృశ్యం శుక్రవారం మండల పరిధిలోని కామవరం గ్రామ సమీపంలో కనిపించింది.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు కోరారు. శుక్రవారం ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ పట్టణ అసోసియేట్ అధ్యక్షుడు వీరేష్ అధ్యక్షతన భోజన విరామ సమయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ.. పీఆర్సీ ప్రకటనలో జాప్యం జరుగుతోందని కనుక 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ ఉపాధ్యాయుల నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ, పురపాలక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలన్నారు. మిగులు ఉపాధ్యాయులను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే సర్దుబాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎస్టీయూ నాయకులు శ్రీనివాసులు, జంబులయ్య, అబీదా బేగం, అహ్మద్ హుసేన్, శ్రీరాములు, జయరాం తదితరులు పాల్గొన్నారు.